## క్లుప్తంగా

### బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం


అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారి

రొంపిచెర్ల: బాల కార్మికుల వ్యవస్థను రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని పీలేరు కార్మిక శాఖ అధికారి కె.ఆర్.ఆనందబాబు కోరారు. మండలంలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడంపై మంగళవారం గ్రేట్ విజన్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు వారిని హోటళ్లు, దుకాణాలు, సైకిల్ షాపులలో ఎవరైనా పనులకు పెట్టుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పేదరికంలో ఉన్న బాల కార్మికులు చదువుకునేందుకు గ్రేట్ విజన్ సొసైటీ సంస్థ చేయూతనిస్తుందని, విద్య, వైద్యం, వసతి కల్పిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రొంపిచెర్లలో హోటళ్లు, దుకాణాలు, సైకిల్ షాపులలో తనిఖీ చేశారు. గ్రేట్ విజన్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు జీవీఎస్.బాబు, పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి

రొంపిచెర్ల: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో ఎస్‌ఐ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా యువకులు మితిమీరిన వేగంతో బైక్స్ నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సెల్ ఫోన్‌లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు కలిగి ఉండాలన్నారు. రికార్డులు లేని వాహనాలను కొనుగోలు చేయరాదని, అవి చాలావరకు చోరీ చేసినవై ఉంటాయన్నారు. అలాంటి వాహనాలు పోలీసులకు పట్టుపడితే వాహనదారులు పూర్తిగా నష్టపోవడమే కాకుండా కేసులు కూడా ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇక, ఆటోలలో ఎవరైనా అనుమానితులు ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు


శిక్షణలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ రాధాకృష్ణ

గుడుపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీఓ రాధాకృష్ణ అన్నారు. స్థానిక శ్రీశక్తి భవనంలో సర్పంచులు, సచివాలయ అధికారులకు రెండవరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పరిశుభ్రత, పచ్చదనం, మహిళల అభివృద్ధి, స్వయం సమృద్ధితో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సామాజిక భద్రత, దివ్యాంగులకు అందించే సేవలు, పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి కల్పన..ఇత్యాది వాటికి ప్రణాళికల రూపకల్పనతో అభివృద్ధి చేసేలా నాయకులు, అధికారులు కలసికట్టుగా పనిచేయాలన్నారు.

# కూతలేస్తున్న గుడ్డు..!


అంగన్‌వాడీల్లో చిన్నారులకు పెడుతున్న గుడ్డు



- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6.50 పైసలు ..రీటైల్‌లో రూ.7
- బయటి ప్రాంతాల నుంచి జిల్లాకు రాని గుడ్లు
- తమిళనాడులో తగ్గిన ఎగుమతులు
- సామాన్యునికి భారంగా మారిన పౌష్టికాహారం

మటన్, చికెన్ కొనలేని సామాన్యులకు కోడిగుడ్డు కొంతవరకు పౌష్టికాహారంగా ఉండేది. హఠాత్తుగా కోడిగుడ్ల ధరలు పెరగడంతో సామాన్యులపై ధరాభారం తప్పడం లేదు. మొన్నటి వరకూ చౌకగా ఉన్న చికెన్ ధరలు సైతం ఉన్నఫలంగా పెరిగాయి. గత నెలలో గుడ్లు హోల్‌సేల్‌గా ఒక్కటి రూ.6 వరకూ ఉండగా ఇప్పుడు రూ.6.50 పైసలకు చేరి రీటైల్‌గా రూ.7 దాటింది. జిల్లాలో పౌల్ట్రీ ఉత్పత్తులు తగ్గడం, బయటి రాష్ట్రాల నుంచి గుడ్ల సరఫరా భారీగా తగ్గుముఖం పట్టడంతోనే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

పలమనేరు: జిల్లాకు మన ఉత్పత్తులతోపాటు తమిళనాడు నుంచి ఎక్కువగా కోడిగుడ్లు వచ్చేవి. అయితే ప్రస్తుతం జిల్లాలో సరాసరి గుడ్ల ఉత్పత్తి 50 నుంచి 60 శాతం వరకూ పడిపోయింది. దీనికి తోడు తమిళనాడు నుంచి దిగుమతులు పూర్తిగా తగ్గాయి. ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణలకు తమిళనాడు నుంచి అధికంగా గుడ్లు డిమాండ్ ఉంది. దీంతో జిల్లాకు అక్కడి వ్యాపారులు ఓ గుడ్డు ఉత్పత్తికి రూ.5 ఖర్చు అవుతోందని.. దీన్ని ఇక్కడికి తరలించేందుకు రవాణా చార్జీలను కలిపి విక్రయిస్తుండడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే సమయంలో స్థానికంగానూ ఉత్పత్తులు లేక ఈ పరిస్థితి తలెత్తినట్టు ప్రస్తుత పరిణామాలు చెబుతున్నాయి.

**దీంతో విద్యార్థులకు కష్టమే**

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. దీనికితోడు ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు, లబ్ధిదారులకు కూడా కోడిగుడ్లను ఇస్తోంది. ధరల పెంపు మూలాన సరఫరాపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్లు చిన్నసైజు గుడ్లను దింపడం మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు ప్రజలు సైతం పౌష్టికాహారం కోసం గుడ్లు కొనడం ఎక్కువైంది. బేకరీల్లో కేకుల తయారీకి ఎక్కువగా గుడ్ల వినియోగం ఉంటోంది. డిమాండ్‌కు సరిపడా సరుకు లేక ధరలు భారీగా పెరగడం వినియోగదారులకు శాపంగా పరిణమించింది.

**రేటు పెరిగాయనే తగ్గిన గుడ్డు సైజు**



గుడ్ల ధరలు ఉన్నట్టుండి పెరిగిపోయాయి. దీంతో గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు సైజు తగ్గించేశారు. పౌష్టికాహారాన్ని అందించాల్సిన ప్రభుత్వం ఇలా నిర్లక్ష్యం చేస్తే ఎలా? కొన్ని హాస్టళ్లలో కనీసం మెనూ ప్రకారం గుడ్లను ఇవ్వడం లేదు. దీనికి కారణం ఏమిటంటే వార్డెన్లే డబ్బులకు కొని గుడ్లను ఇవ్వాలి. కానీ వాటి ధరలు పెరిగాయి. ప్రభుత్వం ఇచ్చే ధరలు గిట్టుబాటు కావు. అందుకు వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

-భువనేశ్వరి, ఐద్వా జిల్లా కన్వీనర్, పలమనేరు

**గుడ్ల ధరలు పెరిగితేనే ఈ కష్టాలు**



పౌష్టికాహారాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వసతి గృహాలు, బడులు, అంగన్‌వాడీ కేంద్రాలు, బాలింతలు, గర్భవతులకు గుడ్లను పంపిణీ చేస్తోంది. కానీ ధరలు పెరిగినప్పుడు సరఫరా సరిగా ఉండడం లేదు. కొందరు క్వాలిటీ తగ్గిన తక్కువ సైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వమే స్పందించాలి.

-పుష్పరాజ్, ఎస్సీ ఉపాధ్యాయ సంఘ మాజీ నేత, పలమనేరు

# సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు


కమ్మపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): సబ్సిడీ ధరకు వ్యవసాయ పనిముట్లను ఇస్తామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు కోరారు. మంగళవారం మండలంలోని వంకమద్దివారిపల్లె, కమ్మపల్లె పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సమావేశం ఏర్పాటు చేసి ఏఓ మాట్లాడారు. వేరుశనగ నూనె తీసే యంత్రాలు, పిండి మెషిన్లు, పొడి కొట్టే యంత్రాలను 50శాతం సబ్సిడీతో వ్యవసాయ శాఖ ఇస్తుందన్నారు. ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించాలన్నారు. వరి, మామిడి, టమాట, వేరుశనగ పంటలకు బీమా చేసుకోవాలన్నారు. అనంతరం వేరుశనగ, వరి పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు శివకుమార్, సిబ్బంది హేమలత, లీల, రైతులు

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


శిక్షణకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ..సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామాల్లో తొమ్మిది లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ లోకనాథం, వ్యవసాయశాఖాధికారి గీతాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏపీఓ హరినాథ్, సర్పంచులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసి డిపోలో బుధవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిపో మేనేజర్ సుధాకరయ్య మంగళవారం తెలిపారు. ఆర్టీసీ సేవలపై ప్రజలు సలహాలు–సూచనలు, ఫిర్యాదులను 9100941850 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

### నేడు సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

పుంగనూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధ, గురువారాలలో గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలా మాధవి తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బందికి ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## ‘ఉపాధి’ మస్టర్ మాయాజాలం

- పనులు చేయని కూలీల పేర్లతో మస్టర్లు..!
- డబ్బుల కోసం కక్కుర్తి
- రైతు ఫిర్యాదుతో వెలుగులోకి
- ఉపాధి హామీ అక్రమాలపై ఏపీడీ విచారణ
- విచారణలో వెల్లడైన అక్రమాలు
- బినామీ వ్యక్తి నుంచి రూ.8,348 రికవరీ

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి పను ల్లో అక్రమాలకు అడ్డూ అదుపే లేకుండాపోతోంది. కూటమి నేతల మాటలు జవదాటని ఉపాధి సిబ్బంది వారు చెప్పినట్టు చేస్తూ చివరకు ఉన్నతాధికారులకు అడ్డంగా బుక్కైపోతున్నారు. వివరాలు.. పలమనేరు మండలంలోని ముసలిమొడుగులో కొందరి రైతులకు సంబంధించి వారికి తెలియకుండానే వారి పొలంలో బౌండరీ ట్రెంచింగ్ పనులకు అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ పనులకు ఉత్తర్వు లు పొందాడు. ఆపై ఆ పనులను తనకు తెలిసిన క్రిష్ణమూర్తితో పాటు పలువురు కూలీలు చేసినట్టు మస్టర్ సృష్టించాడు. ఆపై దీనికి సంబంధించిన బిల్లులను రైతు ఖాతాలోకి పడ్డాయి. ఈ డబ్బును పొందేందుకు బినామీ వ్యక్తి, ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లగా చిర్రెత్తిన ఆ రైతు తనకు తెలియకుండా తన భూమి లో ఉపాధి పనులు చేసినట్టు ఎలా బిల్లు చేసుకున్నారని నిలదీశాడు. ఆపై ఉన్నతాధికారులకు ఫిర్యా దు చేశారు. దీనిపై డ్వామా పీడీ రవికుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో స్థానిక ఈజీఎస్ రవికుమార్ మంగళవారం ముసలిమొడుగులో విచారణ చేశారు. అక్కడి రైతు పొలంలో ఎలాంటి పను లు చేయకుండానే బిల్లులు పెట్టుకున్నట్టు తేలింది. ఇదంతా అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ సహకారంతోనే జరిగిందని ఏపీడీ గుర్తించారు. ఇందుకు కారణమైన బినామీ వ్యక్తి క్రిష్ణమూర్తి నుంచి రూ.8,348 రికవరీకి ఆయన ఆదేశించారు. అయితే ఇందుకు సహకరించిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు! నియోజకవర్గంలో ఇలాంటి అక్రమాలు లక్షల్లో సాగుతున్నా ఇక్కడ వెలుగు చూసింది కాబట్టి బయటపడింది. బయటపడని అక్రమాలు కూటమి నేతలకే తెలియా ల్సి ఉంది. ఇలాంటి అక్రమాలపై స్థానిక ఏపీడీ రవికుమార్‌ను వివరణ కోరగా.. ఇకపై ఇలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం


విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి


కుప్పంలో..

పుంగనూరు: పట్టణంలో తాటిమాకులపాళెంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చెంగారెడ్డి ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తమకు పీఆర్‌సీ, డీఆర్ బకాయిలు చెల్లించాలని, అలాగే ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్ కార్డులను ఉపయోగంలోనికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గంగులమ్మ, లీలావతమ్మ, సరస్వతమ్మ, రెడ్డికుమారి, చంద్ర కళావతి, కమలమ్మ, సీతాపతిరాజు, పద్మనాభన్, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, భరత్‌భూషణ్, రమేష్, శంకరుడు, నారాయణరెడ్డి, ఈశ్వర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**కుప్పంలో..**

కుప్పం: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ పెన్షనర్లు నాగరాజన్, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, రామక్రిష్ణప్ప, తుమ్మప్ప, శాంతకుమారి, రమణ, చెల్లెప్ప, గోపాల్‌ను సన్మానించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెన్షన్‌దారులు పి.జి.సెల్వం, వెంకటేష్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

**పలమనేరులో..**

పలమనేరు: పట్టణంలోని విశ్రాంత పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ స్థానిక అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో సమావేశంలో జిల్లా నాయకులు నాగరాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


పలమనేరులో..

# వరి పంటకు బీమా చేసుకోండి


స్వీట్ కార్న్ తోటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

శాంతిపురం: వరి సాగు చేసిన రైతులు ఫసల్ బీమా యోజన పథకం కింద పంటకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. మంగళవారం కర్లగట్ట పంచాయతీలోని ప్రీతిచామనూరులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులకు సమావేశం ఏర్పాటు చేసి ఏఓ మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ లోపు వరి పంటకు బీమా చేసుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల మూలాన పంట నష్టపోతే బీమా ఆదుకుంటుందన్నారు. సేంద్రియ ఎరువులు, జీవామృతం, కషాయాలతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. పంటల సాగులో తొలుత విత్తనశుద్ధి పాటిస్తే తొలి దశలో వచ్చే పలు చీడపీడలను నివారించవచ్చన్నారు. అనంతరం రైతులతో కలిసి వివిధ పంటలను పరిశీలించారు. స్థానిక రైతులు, రైతు సమాచార కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


రాఘవరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

పలమనేరు: రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాఘవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడి అధ్యాపకులు ఆయన దృష్టికి పలు సమస్యలు నివేదించారు. వాటిని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈ.వాసు తదితరులు పాల్గొన్నారు.

# పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి పురస్కరించుకుని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు సావిత్రీబాయి పూలే పురస్కారాలను అందజేయనున్నట్టు నిర్వాహకులు తులసీనాథం నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలకు సావిత్రిబాయి పూలే స్ఫూర్తిదాయకమని, పురస్కారాలపై ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు ఈనెల 25 లోపు 95534 29770 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

బంగారుపాళెం: ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తికి బంగారుపాళెం ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలని కోరారు. గత పది సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ఏడేళ్లుగా జీతాలు పెంచలేదని సమస్యలు నివేదించారు. ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ క్యాడర్ కంటే తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 పే రివిజన్ స్కేల్ ప్రకారం తమకు జీతభత్యాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# దారి పొడవునా గుంతలే..!

మండలంలోని చెన్నారెడ్డిపల్లె–నగిరేపల్లె రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు పడి రాళ్లు తేలాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయలపేట నుంచి చెన్నారెడ్డిపల్లె మీదుగా కొళత్తూరు, తుర్లపల్లె, నేలపల్లె, పాలేపల్లె, నగిరేపల్లె మీదుగా పుంగనూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చెన్నారెడ్డిపల్లె నుంచి నగిరేపల్లె వరకూ కేవలం 4 కిలోమీటర్ల దూరం. అయితే రోడ్డు దుస్థితి మూలాన నగిరేపల్లెకు వెళ్లాలంటేనే దాదాపు 40 నిమిషాలపైనే ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు.

- దుస్థితిలో చెన్నారెడ్డిపల్లె–నగిరేపల్లె రోడ్డు
- వాహనదారులు, ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


తారు కొట్టుకుపోయి గుంతలతో కంకర తేలిన చెన్నారెడ్డిపల్లె-నగిరేపల్లె రోడ్డు


కొళత్తూరు సమీపంలో ప్రమాదకరంగా మలుపు

పెద్దపంజాణి: చెన్నారెడ్డిపల్లె–నగిరేపల్లె రోడ్డు దుస్థితికి చేరుకుంది. గతుకులు, గుంతలు, తారు కొట్టుకుపోయింది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారు చాలాసార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిలవడంతో ఇంకా పెద్ద గుంతలుపడి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు సరిగా లేకపోవడంతో మోటార్ సైక్లిస్టులు అవస్థలు పడుతున్నారు.

**ప్రమాదకరంగా మలుపులు**

ఈ మార్గ మధ్యంలో కొళత్తూరు నుంచి రాయల చెరువు వరకూ 7 ప్రమాదకర మలుపులున్నాయి. మలుపుల్లో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు రోడ్డు మలుపుల్లో ఏళ్ల తరబడి జంగిల్ క్లియరెన్సు చేయకపోవడంతో ముళ్లచెట్లు రోడ్డును కమ్మేసి ఎదురుగా వచ్చే వాహనాలను కనపడకుండా చేస్తున్నాయి.

**పట్టించుకునే వారేరీ?**

చెన్నారెడ్డిపల్లె–నగిరేపల్లె రోడ్డు దుస్థితికి చేరినా అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. గుంతల్లో ప్రయాణించి వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఈ రోడ్డులో రాయలపేట నుంచి పుంగనూరు వరకూ రోజూ తిరిగే ప్రైవేటు టౌన్ బస్సు ఆపరేటర్లు స్వచ్ఛందంగా గుంతలకు మట్టి వేశారు. కాని ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ మట్టి కూడా కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయడంతోపాటు మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**రోడ్డు వేయాలి**



చెన్నారెడ్డిపల్లె నుంచి నగిరేపల్లె వరకూ రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. రహదారి పూర్తిగా పాడైపోయింది. ఎక్కడిక్కడ గోతులు, తారు కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

-ప్రసాద్‌రెడ్డి, నేలపల్లె

**వర్షం పడితే అంతే..**



చెన్నారెడ్డిపల్లె–నగిరేపల్లె రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి ప్రయాణం నరకంగా మారుతోంది. తారు మొత్తంపోయి కంకర తేలింది. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారికి ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు, పాలకులు స్పందించాలి.

-చంద్రారెడ్డి, నేలపల్లె

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

గత ప్రభుత్వం చెన్నారెడ్డిపల్లె నుంచి నగిరేపల్లె వరకూ ఏఎంసీ గ్రాంటు కింద రోడ్డు పనులకు రూ 1.5 కోట్లు మంజూరు చేసి టెండర్ పిలిచింది. అయితే టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో వర్క్ కేన్సిల్ చేశాం. ప్రస్తుతం రీ-ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే రోడ్డు పనులకు పూనుకుంటాం

-శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ